## క్లుప్తంగా

### రెవెన్యూ సమస్యలకు సత్వర పరిష్కారం



రెవెన్యూ అధికారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ అనుపమ

సి.బెళగల్: మండలంలోని రెవెన్యూ అధికారులు తమ పరిధిలోని పెండింగ్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని తహసీల్దార్ అనుపమ అన్నారు. బుధవారం తన కార్యాలయంలో వీఆర్వోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్‌లో తెలియజేసిన అంశాలను వారికి వివరించారు. వీఆర్వోల లాగిన్‌లో ఉన్న క్యాస్ట్ సర్టిఫికెట్ల వివరాలను వీలైనంత త్వరగా పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. అదేవిధంగా భూముల ఆన్‌లైన్, పట్టాదారు పాసుపుస్తకాల జారీలో జాప్యం లేకుండా చూడాలన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ సమర్థవంతంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ కృష్ణమూర్తి, మండల సర్వేయర్ నాగభూషణం, వీఆర్వోలు, సర్వే సహాయకులు పాల్గొన్నారు.

### వీఆర్‌ఏ మృతి



కుటుంబానికి ఆర్థికసాయం అందిస్తున్న తహసీల్దార్ జమానుల్లాఖాన్

గడివేముల: మండల పరిధిలోని బిలకలగూడూరు గ్రామానికి చెందిన వీఆర్‌ఏ ప్రభాకర్ (55) బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. మృతుడి కుటుంబాన్ని తహసీల్దార్ జమానుల్లాఖాన్, వీఆర్వో కృష్ణుడు పరామర్శించారు. కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు.

### ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు



మాట్లాడుతున్న ఆర్టీసీ డీఎం గంగాధర్

పాణ్యం: ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని నంద్యాల ఆర్టీసీ డిపో మేనేజర్ గంగాధర్ అన్నారు. బుధవారం పాణ్యం బస్టాండ్‌ను సందర్శించారు. ప్రయాణికులు, స్థానికులతో సౌకర్యాలు, సమస్యలపై ఆరా తీశారు. బస్టాండ్‌లో ప్రయాణికులకు తాగునీరు, మరుగుదొడ్లు లేవని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. విషయాన్ని రీజినల్ మేనేజర్ (ఆర్ఎం) దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరగా సమస్యలను పరిష్కరిస్తామని డీఎం తెలిపారు. ఆర్టీసీ బస్సుల్లోనే సురక్షిత ప్రయాణమని.. అందరూ ఆర్టీసీకి సహకరించాలని కోరారు.

### కేసీ కెనాల్‌కు 104 క్యూసెక్కుల నీరు

గూడూరు రూరల్: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కెనాల్‌కు 104 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు బుధవారం డ్యాం జేఈ రాజు తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయర్‌కు ఎగువ నుంచి నీటి విడుదల ఆగిపోయిందని చెప్పారు. కేవలం కేసీ కెనాల్‌కు మాత్రమే నీటిని విడుదల చేస్తున్నామని పేర్కొన్నారు.

### అసోసియేషన్ కార్యాలయం ప్రారంభం



మినీ లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

కల్లూరు: కల్లూరు అర్బన్ పరిధిలోని వై జంక్షన్ ఉల్చాల రోడ్డులో కర్నూలు మినీ లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయాన్ని బుధవారం ప్రారంభించారు. మార్కెట్ యార్డు మాజీ చైర్మన్, టీడీపీ కల్లూరు అర్బన్ కన్వీనర్ పెరుగు పురుషోత్తం రెడ్డి ముఖ్య అతిథిగా ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ప్రభాకర్ యాదవ్, నాగరాజు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

### కుల ధ్రువీకరణ పత్రాల జారీలో నిర్లక్ష్యం తగదు

కర్నూలు (టౌన్) : నగరపాలక సంస్థ పరిధిలోని సచివాలయాల్లో కులధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకునే వారికి ఇబ్బందులు లేకుండా త్వరితగతిన మంజూరు చేయాలని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ ఆదేశించారు. బుధవారం నగరపాలక నూతన కౌన్సిల్ హాలులో వీఆర్‌ఓలతో సమావేశం నిర్వహించారు. నగర పరిధిలోని సచివాలయాల్లో 32,320 మందికులధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు. అయితే, ఇప్పటి వరకు 8,027 పత్రాల పరిశీలన మాత్రమే జరగడంపై కమిషనర్ అసంతృప్తి వ్యక్తం చేశారు.

# బడి బస్సు భద్రతపై దృష్టి



బడి బస్సు డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ గౌతమి



బడి బస్సును తనిఖీ చేస్తున్న పోలీసులు

- నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవు
- స్పెషల్ డ్రైవ్ నిర్వహించిన ట్రాఫిక్ పోలీసులు

కర్నూలు: బడి బస్సు భద్రంగా ఉంటే పిల్లల ప్రయాణం సురక్షితమవుతుంది. ఈ నేపథ్యంలో బడి బస్సుల భద్రత ఎలా ఉందనే దానిపై ట్రాఫిక్ పోలీసులు బుధవారం నగరంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. సీఐ గౌతమి ఆధ్వర్యంలో ట్రాఫిక్ సిబ్బంది రెండు బృందాలుగా ఏర్పడి రాజ్‌విహార్, ఉడ్‌ల్యాండ్ సర్కిల్ వద్ద రెండు గంటల పాటు విద్యా సంస్థల బస్సులను తనిఖీ చేశారు. చాలామంది డ్రైవర్లు యూనిఫాం లేకుండానే బస్సులు నడుపుతుండటంతో అలాంటి వారిని సమావేశపరచి సీఐ గౌతమి కౌన్సెలింగ్ నిర్వహించారు. అలాగే కొత్త చట్టాల గురించి కూడా వారికి వివరిస్తూ నిబంధనలు పాటించకపోతే భారీగా జరిమానా చెల్లించక తప్పదని హెచ్చరించారు. బస్సుకు సంబంధించిన ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్, డ్రైవర్‌కు సంబంధించి లైసెన్స్ అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. బస్సును వేగంగా నడిపినా, అజాగ్రత్తగా సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడిపినా చర్యలు తప్పవని హెచ్చరించారు. బడి బస్సుల నిర్వాహకులు వాటికి సంబంధించిన పత్రాలు లేకుండా రోడ్డుపైకి తీసుకురాకూడదని హెచ్చరించారు. ఇందులో భాగంగా లైసెన్స్ లేకుండా నడుపుతున్న ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలు, ఆటోలను కూడా తనిఖీ చేశారు. వాహనాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించి మోటర్ వాహన చట్టం కింద చలానాలు విధించినట్లు సీఐ తెలిపారు.

## ప్రభుత్వాస్పత్రుల్లో సురక్షిత ప్రసవం



సిబ్బందికి సూచనలు ఇస్తున్న జిల్లా పబ్లిక్ హెల్త్ నర్సింగ్ ఆఫీసర్ ఇందిరా

కోడుమూరు రూరల్: ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవం ద్వారా తల్లీబిడ్డ క్షేమంగా ఉంటారని జిల్లా పబ్లిక్ హెల్త్ నర్సింగ్ ఆఫీసర్ ఇందిరా అన్నారు. బుధవారం కోడుమూరులో వైద్య సిబ్బంది నిర్వహిస్తున్న స్టాప్ డయేరియా– వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆమె తనిఖీ చేశారు. వైద్యసేవలపై పీహెచ్‌సీ డాక్టర్ శ్రీమంత్‌మాదన్నను ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మాతా శిశు సంరక్షణ కోసం ప్రభుత్వం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టిందని తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఆశా, ఆరోగ్య కార్యకర్తలు ప్రతి గర్భిణికి క్రమం తప్పక ఆరోగ్య పరీక్షలు చేయించాలన్నారు. ప్రమాదకర పరిస్థితులుంటే హైరిస్క్‌గా నమోదు చేసి వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఎప్పటికప్పుడు వారికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ నరసప్ప, హెల్త్ సూపర్‌వైజర్లు ఉమాభాయి, కమాల్ సాహెబ్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వనిత, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎన్‌టీఏను రద్దు చేయాలని ఆందోళన



నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

పాణ్యం: నీట్ పేపర్ లీకేజీతో వైద్య విద్య చదవాలనుకున్న విద్యార్థుల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారిందని.. నీట్ నిర్వహించే ఎన్‌టీఏను రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం పాణ్యం డిగ్రీ కళాశాల ఎదుట నిరసన తెలిపారు. నీట్ ద్వారా నష్టపోయిన ప్రతి విద్యార్థికి న్యాయం చేయాలని కోరారు. ఇందుకు కారకులైన వారికి కఠినంగా శిక్షించాలన్నారు. గురువారం తలపెట్టిన విద్యాసంస్థల బంద్‌కు అందరూ సహకరించాలని కోరారు. ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రతాప్, వెంకటసాయి, మధు, కిషోర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రంగస్వామి

కోడుమూరు రూరల్: నీట్ పేపర్ లీకేజీని నిరసిస్తూ గురువారం తలపెట్టిన విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రంగస్వామి కోరారు. బుధవారం కోడుమూరు సీపీఐ కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక దేశం –ఒక పరీక్ష ముసుగులో మొత్తం పరీక్షా వ్యవస్థే కుప్పకూలిందని, నీట్ పేపర్ లీక్‌పై ఫిర్యాదులు వెల్లువెత్తడంతో విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. నీట్, యూజీసీ నెట్ పేపర్ లీకేజీలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని, ఎన్‌టీఏను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బంద్‌కు విద్యాసంస్థల యాజమాన్యాలు, ప్రజాసంఘాల నాయకులు విజయవంతం చేయాలని కోరారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు సిద్ధూ, కిశోర్, మహేష్ పాల్గొన్నారు.

## ఆస్పత్రిలో పారిశుధ్యం మెరుగుపడాలి

- పెద్దాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి



ఆస్పత్రిలో పర్యటిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు (హాస్పిటల్): పెద్దాసుపత్రిలో పారిశుధ్యం మెరుగుపడాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం ఆయన ఆస్పత్రిలోని ఫార్మసీ విభాగం, ఔషధశాల, క్యాజువాలిటీ, ఓల్డ్ బ్లడ్ బ్యాంక్ తదితర విభాగాలను పరిశీలించారు. ఫార్మసీ విభాగంలో ఆన్‌లైన్ ప్రాసెస్‌పై ఆరా తీశారు. ఆన్‌లైన్ ఎంట్రీలో జరుగుతున్న విధానాన్ని పరిశీలించారు. ఈ–ఫార్మసీ ఆన్‌లైన్ ఎంట్రీ విధానం వంద శాతం పూర్తి చేయాలని, కర్నూలు ప్రభుత్వాస్పత్రిని ప్రథమ స్థానంలోకి తీసుకురావాలని ఫార్మసీ సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. అనంతరం ఔషధ శాల విభాగం వద్ద శానిటేషన్ పనులపై ఆరా తీశారు. మూడు రోజులైనా పారిశుధ్య పనులు ఓ కొలిక్కి రావడం లేదని అసహనం వ్యక్తం చేశారు. కాలువల్లో సీల్టు తీయాలని ఆదేశించారు. మెకానిక్ షెడ్డును పరిశీలించి అక్కడ ఉన్న ట్రాలీలను మరమ్మతులు చేయాలని చెప్పారు. శానిటేషన్ విభాగం స్టాక్ పాయింట్‌లో ఉన్న మెటీరియల్, సిబ్బంది గురించి ఆరా తీశారు. ఆయన వెంట ఆసుపత్రి ఏడీ రమేష్ బాబు, ఏఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ శివబాల నాగాంజన్, కిరణ్‌కుమార్, సునిల్ ప్రశాంత్, ఫార్మసీ మెడికల్ ఆఫీసర్ శారద తదితరులు పాల్గొన్నారు.

### నేడు వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి

గడివేముల: మండల పరిధిలోని బిలకలగూడూరు సమీపంలో ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయం (టెంపుల్ ఆఫ్ స్టెప్స్)లో గురువారం బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఉదయం 8 గంటలకు కలశస్థాపన, అగ్నిప్రతిష్ఠ, సుదర్శన హోమం, పూర్ణాహుతి, 11 గంటలకు మూలమూర్తికి అభిషేకాలు, అలంకరణ, మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు శాంతి కల్యాణం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జిందాల్ యాజమాన్యం ఏర్పాట్లు పూర్తి చేసింది.

## ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైంది



హెచ్‌ఎం పదవీ విరమణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ ఉసేన్‌బీ

పాణ్యం: ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందని.. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే గురుతర బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని ఎంపీపీ ఉసేన్‌బీ అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పాణ్యం మెయిన్ పాఠశాల హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, తమ్మరాజుపల్లె ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం యాగంటయ్య పదవీ విరమణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికీ జ్ఞానాన్ని పంచి మంచి మార్గంలో నడిపించే మార్గదర్శి ఉపాధ్యాయుడు అని పేర్కొన్నారు. సమసమాజ స్థాపనలో గురువులదే కీలక పాత్ర అన్నారు. ఎంతో మందిని మంచిగా తీర్చిదిద్దే అవకాశం ఉన్న ఏకైక వృత్తి ఉపాధ్యాయ వృత్తి ఒక్కటే అని తెలిపారు. అనంతరం ఇరువురిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఫణికుమార్, ఎంపీడీఓ భాగ్యలక్ష్మి, సర్పంచ్ మేకల పల్లవి, ఎంఈఓలు కోటయ్య, సుబ్రమణ్యం, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

### రాహుల్ వ్యాఖ్యలపై నిరసన



రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న విశ్వహిందూ పరిషత్ సభ్యులు



కోడుమూరులో రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను ఊరేగిస్తున్న బీజేపీ నాయకులు

పాణ్యం: కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ హిందువులపై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ పాణ్యంలో విశ్వహిందూ పరిషత్ సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. బుధవారం పాణ్యం నాలుగు రోడ్ల కూడలిలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పరిషత్ సభ్యులు మాట్లాడుతూ.. ఎన్నికల ముందుకు తాను హిందూవునని చెప్పుకుని తీరా ఎన్నికలు పూర్తి కాగానే హిందువులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. తన మాటలను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సభ్యులు శంకరయ్య, జగదీష్, బాలిరెడ్డి, మద్దిలేటి, వీరభద్ర, సురేష్ తదితరుల పాల్గొన్నారు.

కోడుమూరు రూరల్: పార్లమెంట్‌లో హిందువులను కించపరుస్తూ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ బుధవారం సాయంత్రం కోడుమూరులో బీజేపీ, విశ్వహిందూ పరిషత్ నాయకులు ఆందోళన చేశారు. రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మకు చెప్పులదండ వేసి ఆర్టీసీ బస్టాండ్ నుంచి పాతబస్టాండ్ వరకు ర్యాలీగా వెళ్లారు. అక్కడ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా మాట్లాడడం సరికాదన్నారు. బీజేపీ నాయకులు వేల్పుల గోపాల్,మల్లేష్ నాయుడు, విశ్వహిందూ పరిషత్ నాయకులు నాగేశ్వర రావు, కిరణ్, తాయప్ప, విఠల్, అశోక్, సోమ ప్ప, ప్రతాప్‌రెడ్డి, సురేష్ పాల్గొన్నారు.

## ఈ రోడ్డుకు మోక్షమెప్పుడో..?



కొర్రపోలూరు నుంచి సోమాపురానికి వెళ్లే రోడ్డు దుస్థితి

- కంకర తేలి దుస్థితికి చేరుకున్న రోడ్డు
- ఇబ్బందులు పడుతున్న సోమాపురం వాసులు

గడివేముల: మండలంలోని కొర్రపోలూరు పంచాయతీ సోమాపురం గ్రామానికి సరైన రోడ్డు లేకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో 70 ఇళ్లు, 310 మంది జనాభా ఉన్నారు. గ్రామస్తులకు ఏ చిన్న పని పడినా గడివేములకు రావాల్సి ఉంటుంది. కొర్రపోలూరు నుంచి సోమాపురం వరకు 1.5 కిలోమీటర్ల దూరం మెటల్ రోడ్డు ఉంది. రోడ్డుపై కంకర తేలి ఉండడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. కొర్రపోలూరు వరకు నడుచుకుంటూ వచ్చి అక్కడి నుంచి ఆటోలు, బస్సుల్లో వెళ్లాల్సి ఉంటుంది. గ్రామం నుంచి సుమారు 20 విద్యార్థులు గడివేములలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఏపీ మోడల్ స్కూలుకు సైకిళ్లపై వస్తుంటారు. గడివేముల నుంచి సోమాపురానికి నాలుగు కి.మీ దూరం సైకిల్ తొక్కుకుంటూ వెళ్లి చదువుకుంటున్నారు. రోడ్డు సరిగ్గా లేకపోవడంతో సైకిల్‌పై రావడం చాలా కష్టంగా ఉందని విద్యార్థులు చెబుతున్నారు. సైకిల్ తొక్కడం రాకపోతే స్కూళ్లకు పోవడం మానేయాల్సి వస్తోందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డులో రాత్రి పూట, వర్షా కాలంలో ప్రయాణించాలంటే చాలా ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు వాపోతున్నారు. అధికారులు స్పందించి తారు రోడ్డు మంజూరు చేయడంతో పాటు బస్సు సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



పెసరవాయి గ్రామంలో విత్తనాలు వేసేందుకు సిద్ధం చేసిన పొలం

## చినుకు జాడేది.!

గడివేముల: వానాకాలం వచ్చినా మబ్బులే తప్ప చినుకు జాడ కనిపించడం లేదు. మండలంలో వ్యవసాయానికి అవసరమైన వర్షాలు లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అసలైన తొలకరి కోసం ఆకాశం వైపు ఆశగా ఎదురు చూస్తున్నారు. గతేడాది జూన్‌లో మోస్తరుగా వర్షాలు కురిశాయి. ఆరంభంలోనే వరుణ దేవుడు కరుణించడంతో రైతులు ఉత్సాహంగా ఖరీఫ్ సాగు పనులు మొదలు పెట్టారు. కానీ ఈ ఏడాది జూలై ప్రారంభమై కార్తెలు వెళ్లిపోతున్నా నేటికీ సరైన వర్షాలు కురవడం లేదు. వర్షాలతో చల్లబడాల్సిన వాతావరణం భానుడి భగభగలతో మండిపోతోంది. అంతే కాకుండా పగటి ఉష్ణోగ్రతలు 38 డిగ్రీల వరకు నమోదు అవుతున్నాయి. మండే ఎండలకు ఉక్కపోత తోడవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. పగటి ఉష్ణోగ్రతలు పెరగడమేగాక రాత్రి పూట కూడా వాతావరణం వేడిగానే ఉంటోంది. ఇప్పటికీ సూర్యుడు తన ప్రతాపాన్ని చూపిస్తూనే ఉన్నాడు. వర్షాలు కురుస్తాయని ఆశతో రైతులను దున్నుకుని విత్తనాలు నాటేందుకు సిద్ధంగా ఉన్నారు. మండలంలో ఖరీఫ్ సీజన్‌లో సుమారు 22 వేల ఎకరాల్లో పంటలు సాగు చేయనున్నట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

## జీతాలు చెల్లించాలని సెక్యూరిటీ గార్డుల నిరసన

- త్వరలో చెల్లిస్తామన్న యాజమాన్యం



ధర్నా చేస్తున్న సెక్యూరిటీ గార్డులు, సీపీఎం నాయకులు

కోడుమూరు రూరల్: మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలు చెల్లించాలని పవన విద్యుత్ ఫ్యాన్ల(విండ్ వీల్స్) సెక్యూరిటీ గార్డులు నిరసన వ్యక్తం చేశారు. బుధవారం కోడుమూరు మండలం ప్యాలకుర్తిలోని ఆ సంస్థ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. వారికి సీపీఎం, ప్రజా సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి, కమిటీ సభ్యుడు నారాయణ, మోహన్ మాట్లాడుతూ.. గ్రీన్‌కో కంపెనీకి సంబంధించి సబ్ కాంట్రాక్ట్ కంపెనీ యువర్ రెన్యూలో కోడుమూరు, గూడూరు, సి.బెళగల్ మండలాల్లో సుమారు 300మంది సెక్యూరిటీ గార్డులు పనిచేస్తున్నారని తెలిపారు. వారికి మూడు నెలల నుంచి కంపెనీ జీతాలు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. జీతాలు చెల్లించాలని ప్యాలకుర్తి వద్ద ఉన్న జీరో పాయింట్‌లోని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. స్పందించిన యాజమాన్యం త్వరలో జీతాలు చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. సీపీఎం మండల కార్యదర్శి గఫూర్‌మియ్యా, నాయకులు ఈరన్న, వీరన్న, రాజు, ఎర్రమద్దిలేటి, లక్ష్మన్న పాల్గొన్నారు.

## పండ్ల తోటలతో సుస్థిర ఆదాయం



పండ్ల మొక్కలను పరిశీలిస్తున్న పీడీ అమర్‌నాథ్‌రెడ్డి

ఓర్వకల్లు: పండ్ల తోటల పెంపకంతో చిన్న, సన్నకారు రైతులకు సుస్థిర ఆదాయం లభిస్తుందని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా బుధవారం ఓర్వకల్లు మండలంలోని గుడుంబాయి తండాలో పర్యటించారు. బద్దిబాయి, తిరుపాలుబాయి అనే మహిళ రైతులు జాతీయ ఉపాధి హామీ పథకం కింద ఎకరాలో సాగు చేసిన మామిడి మొక్కలను పరిశీలించారు. ఈ సందర్భంగా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతులు సాధారణ పంటల సాగుతో పాటు బోరు సదుపాయం ఉన్న వారు ఎకరా/రెండు ఎకరాల్లో పండ్ల తోటలను పెంచుకోవాలని సూచించారు. ఆసక్తి ఉన్న రైతులకు ప్రభుత్వమే మొక్కల ఖర్చు భరిస్తుందని తెలిపారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మండలంలో 500 ఎకరాల్లో పండ్ల మొక్కలను పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు 250 ఎకరాలను గుర్తించామని పేర్కొన్నారు. జాబ్‌కార్డు కలిగి 5 ఎకరాల్లోపు పొలం ఉన్న రైతులు జాతీయ ఉపాధి హామీ పథకంలో పండ్ల తోటల పెంపకం చేపట్టే విధంగా ప్రోత్సహించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం కాల్వ గ్రామం వద్ద చెక్‌డ్యామ్‌లో పూడికతీత పనులను పరిశీలించి, మస్టర్లను తనిఖీ చేశారు. ఆయన వెంట ఏపీఓ కుమార్‌సాయినాథ్, సాంకేతిక, క్షేత్రస్థాయి సహాయకులు ఉన్నారు.

### పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన



చేతులు శుభ్రతపై అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ

కల్లూరు: పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఎంఈఓ–1 శ్రీనివాసులు అన్నారు. బుధవారం కల్లూరు మండల విద్యాధికారి కార్యాలయం వద్ద డేటాల్ బనౌగా స్వస్థ ఇండియా సార్స్ సంస్థ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు పరిశుభ్రతపై ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డీబీఎస్ఐ సంస్థ సభ్యులు చేతుల పరిశుభ్రతపై ఆరు రకాల విధానాలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు విద్యార్థులకు వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రత, పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులకు పాఠాలతో పాటు క్రమశిక్షణ, పరిశుభ్రత గురించి తెలియజేయాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయులకు సర్టిఫికెట్లు అందజేశారు. ప్రాజెక్టు మేనేజర్ కుమారి, పుల్లన్న, దర్గయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.